క్లుప్తంగా

ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే పరామర్శ



అనపర్తి ఏరియా ఆస్పత్రిలో వృద్ధురాలిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: అనపర్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మంగళవారం పరామర్శించారు. బిక్కవోలు మండలం రంగాపురం గ్రామానికి చెందిన గండికోట సత్యవతి, పోతు రాంబాబు తదితరులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో రంగాపురం సర్పంచ్ గండికోట వీరభద్రరావు, గండికోట అప్పారావు, సాయి సూర్యనారాయణరాజు, పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రాజానగరం: డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ద్వారా మగ్గం వర్క్ శిక్షణను పూర్తి చేసుకున్న మహిళలకు దివాన్ చెరువులోని ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం జీవీనగర్‌కు చెందిన 40 మంది మహిళలకు వీటిని అందించారు. వక్తలు మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధిని సాధించాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

వెంకట రమణకు పీహెచ్‌డీ అందజేత



వెంకట రమణకు పీహెచ్‌డీని అందజేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య శ్రీనివాసరావు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 'పీవీ సునీల్ కుమార్ సాహిత్యం – సమాలోచన' అనే అంశంపై పరిశోధనను పూర్తి చేసిన డి.వెంకట రమణకు తెలుగు విభాగం నుంచి తొలిసారిగా పీహెచ్‌డీని ప్రదానం చేశారు. ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు చేతుల మీదుగా మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ కేవీఎన్‌డీ వరప్రసాద్‌తో పాటు డాక్టర్ మోగంటి సుధామయి పర్యవేక్షణలో వెంకట రమణ ఈ పరిశోధనను పూర్తి చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, సీడీసీ డీన్ ఆచార్య కేఎస్ రమేష్, తెలుగు శాఖ అధ్యాపకులు తలారి వాసు, టి. సత్యనారాయణ, డి.లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

నేడు వరలక్ష్మి కానుకకు లక్కీడ్రా

మధురపూడి: కోరుకొండ శ్రీవల్లీ సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి బంగారు వరలక్ష్మి కానుకకు లక్కీడ్రా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని నిర్వాహకుడు, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. మహిళల్లో హైందవ చైతన్యాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. దీని కోసం నిర్వహించిన రిజిస్ట్రేషన్‌లో 1,980 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. లక్కీడ్రా అనంతరం విజేతలకు రూ.7,500 విలువైన ఒక గ్రాము బంగారు వరలక్ష్మి రూపులను అందిస్తామన్నారు.

85 నంబర్ జీవోపై పునరాలోచన చేయాలి



డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ వైద్యుల పీజీ ప్రవేశాలకు సంబంధించిన ఇన్ సర్వీస్ కోటాను తగ్గిస్తూ విడుదల చేసిన 85 నంబర్ జీవోపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ప్రభుత్వ వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం బొమ్మూరులోని వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మశ్రీలకు ప్రభుత్వ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ మౌనిక, ఇతర వైద్యాధికారులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ 85 నంబర్ జీవోను వెనక్కి తీసుకోని, ఇన్ సర్వీస్ కోటాను మునుపటి లాగానే ఉంచాలన్నారు. ఇది సాధించే వరకూ తాము పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

మోతాదు మించితే అనర్థమే

- రసాయనిక ఎరువులు అతిగా వినియోగిస్తే పంటకు నష్టం
- భూసార పరీక్షల ఆధారంగానే వాడాలంటున్న వ్యవసాయాధికారులు



పొలంలో పురుగుల మందు పిచికారీ చేస్తున్న రైతు

పెదపూడి: పంటలను ఆశించే తెగుళ్లను నివారించేందుకు రైతులు విచ్చలవిడిగా ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగిస్తుంటారు. అయితే రసాయనిక ఎరువుల వినియోగం ఏటికేడు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తుంది. మోతాదుకు మించి పురుగుమందులు వినియోగిస్తే అనర్థాలే ఎక్కువగా ఉంటాయని వ్యవసాయ శాఖాధికారులు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవడం, భూసారం దెబ్బతినడమే కాకుండా దిగుబడిపై సైతం ప్రభావం పడుతుందంటున్నారు. పురుగుమందుల వినియోగంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని, వ్యవసాయ అధికారుల సలహాలను పాటిస్తే మంచిదని సూచిస్తున్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

అనపర్తి నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 45,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అనపర్తి మండలంలో 12,000 ఎకరాల్లో, పెదపూడి మండలంలో 18,500 ఎకరాల్లో, రంగంపేట మండలంలో 2,000 ఎకరాల్లో, బిక్కవోలు మండలంలో 13,000 ఎకరాల్లో సాగు చేపట్టారు. ఇప్పటికే దాదాపుగా వరి నాట్ల ప్రక్రియ పూర్తయింది. ప్రస్తుతం ఎరువులు జల్లడం, పురుగుమందుల పిచికారీ చేసే పనిలో అన్నదాతలు నిమగ్నమై ఉన్నారు. మార్కెట్లో కొత్త కొత్త రకాల ఎరువులు, పురుగుల మందులు తక్కువ ధరలకే అందుబాటులోకి వస్తున్నాయి. అయితే వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకోకుండా ఆయా మందులను ఇష్టారీతిన వాడుతుండడంతో రైతులు పంటలను కోల్పోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. క్రిమి సంహారక మందులు అతిగా వినియోగించడం వల్ల భూసారం తగ్గడంతో పాటు భూమికి మేలు చేసే వానపాములు వంటివి చనిపోతాయి. అందుకే రైతులు పంట సాగు చేసే సమయంలో భూసార పరీక్షలు చేయించుకుని, వాటి ఫలితాల ఆధారంగా భూమికి కావాల్సిన పోషకాలు అందిస్తే మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగం మేలు

రసాయన ఎరువుల వినియోగం వల్ల ముందులో దిగుబడి అధికంగా కనిపించినా భూసారం దెబ్బతింటుంది. ఆ తరువాత క్రమేపి దిగుబడి తగ్గిపోవడమే కాకుండా భూమి బీడుగా మారిపోతుంది. సరైన మోతాదులో ఎరువుల వినియోగంతోనే పంటలకు మేలు జరుగుతుంది. అలాగే రెండు మూడు రకాల పురుగు మందులను మిశ్రమంగా చేసి పిచికారీ చేసినా పంటకు మంచిది కాదు. సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెరగడంతో పాటు దీర్ఘకాలంగా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

మోతాదుకు మించి వాడరాదు



పంటలకు వ్యాధులు సంక్రమించినప్పుడు ముందుగా వ్యవసాయాధికారులను సంప్రదించి వారి సూచనల మేరకు ఎరువులు, పురుగుమందులు వాడుకోవాలి. మోతాదుకు మించి ఎరువులు వినియోగిస్తే పంటకు, భూమికి నష్టమే తప్ప లాభం ఉండదు. కలుపు మందు కొట్టిన తరువాత పురుగుమందు కొట్టకూడదు.

– టీవీఆర్ మణిదీప్, మండల వ్యవసాయశాఖాధికారి, పెదపూడి

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే ఎన్‌సీసీ



మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ కేడెట్లు

రాజానగరం: విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుందని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్ అన్నారు. కాకినాడ గ్రూప్ 18 ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వార్షిక శిక్షణ కార్యక్రమంలో భాగంగా యూనివర్సిటీ ప్రాంగణంలో మంగళవారం మొక్కలు నాటారు. క్రమశిక్షణతో కూడిన జీవనానికి ఎన్‌సీసీ తోడ్పడుతుందన్నారు. మన ఇంటిని ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటామో.. మన చుట్టూ ఉన్న పరిసరాలను కూడా అలాగే చూసుకోవాలన్నారు. తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల అధ్యాపకురాలు కె.సీతామహాలక్ష్మి మాట్లాడుతూ బేటీ పడావో, బేటీ బచావో గురించి తెలియజేశారు. కార్యక్రమంలో గైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ మేజర్ మహ్మద్ ఆసిఫ్, ఏఎన్ఓ తేజేశ్వరరాజు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్ బాబు

రాజానగరం: మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతిపెద్ద సాంఘిక సమస్యగా మారిందని, దానిని అరికట్టడంలో యువత కీలకపాత్ర పోషించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు అన్నారు. తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. విద్యార్థి దశలో ఎదురయ్యే అనేక సమస్యలను, వాస్తవిక కథనాలతో విద్యార్థులకు అవగాహన కలిగించారు. డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు సోషల్ మీడియా యాప్స్ వినియోగంపై స్వీయ నియంత్రణ అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.రాజశ్రీరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సూరిబాబు, బీసీ సంక్షేమ శాఖ అధికారి పీఎస్ రమేష్, జిల్లా మహిళ సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయకుమారి, గిరిజన సంక్షేమ శాఖ ప్రతినిధి జ్యోతి, భూమిక కలెక్టివ్ కౌన్సిలింగ్ సంస్థ ప్రతినిధి అప్పయ్యమ్మ పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు



చినకొండేపూడిలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెదలక్ష్మి

సీతానగరం: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయని, ఆడపిల్లలను చక్కగా చదివించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కె.పెదలక్ష్మి అన్నారు. ఐసీడీఎస్, వైద్య,ఆరోగ్యశాఖల సంయుక్త ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మంగళవారం చినకొండేపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం ఎస్.కృపారాణి మాట్లాడుతూ ముఖ్యంగా భ్రూణ హత్యలు జరగకుండా చూడాలని, బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. 18 ఏళ్ల నిండకుండా ఆడపిల్లలకు వివాహాలు చేయరాదన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు ఎం.విశాలి, కె.కృష్ణవేణి, ఆశావర్కర్ బి.విజయలక్ష్మి, ఏఎన్ఎంలు సుభాషిణి, ఎలిజిబెత్, సునీత, శాంతి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్‌ఓ ప్లాంట్లలో విస్తృత తనిఖీలు

- నీటి శాంపిళ్లను సేకరించి పరీక్షించిన అధికారులు

సాక్షి ఇంపాక్ట్



సింగంపల్లిలో ఆర్‌ఓ ప్లాంట్ నీటి నాణ్యతను పరీక్షిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

రంగంపేట: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆర్‌ఓ ప్లాంట్లలో అధికారులు మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఆర్‌ఓ ప్లాంట్లలోని నీటి శాంపిళ్లను సేకరించి సచివాలయాలకు తీసుకెళ్లి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. సోమవారం 'సాక్షి' దినపత్రికలో శుద్ధ జలగాటం శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంపీడీఓ పి.వెంకటరత్నం స్పందించారు. మండలంలోని అన్ని ఆర్‌ఓ ప్లాంట్లను తనిఖీ చేసి నీటి శాంపిళ్లను సేకరించి పరీక్షలు చేసి నివేదిక ఇవ్వాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. దీంతో అప్రమత్తమైన అధికారులు చంద్రేడు, జి.దొంతమూరు, కోటపాడు, మర్రిపూడి, ముకుందవరం, నల్లమిల్లి, రంగంపేట, ఎస్టీరాజాపురం, సింగంపల్లి, సుభద్రంపేట, వడిశలేరు గ్రామాల్లో ఆర్‌ఓ ప్లాంట్లలో నీటి శాంపిళ్లను తీసుకుని నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటరత్నం మాట్లాడుతూ మండలంలో 15 ఆర్‌ఓ ప్లాంట్లు పనిచేస్తున్నాయని ప్రతి ఆర్‌ఓ ప్లాంట్ నుంచి నీటి నమూనాలను సేకరించి 9 రకాల టెస్టులు చేయించామన్నారు. అనుమతులు లేని ఆర్‌ఓ ప్లాంట్లను సైతం తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

గోదావరి వరద తగ్గుముఖం



బొబ్బిల్లంక రేవులో తగ్గుముఖం పట్టిన గోదావరి

సీతానగరం: గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. దీనితో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. బొబ్బిల్లంక అశోక్ నగర్ వద్ద ఏటిగట్టు కోతకు గురవ్వడంతో అప్రమత్తమైన అధికారులు రాక్ బౌల్డర్లను డంపింగ్ చేయడానికి రోడ్డు మార్గం ఏర్పాటు చేసి రెండు రోజులైంది. కానీ రాక్ బౌల్డర్లు తీసుకురావడానికి నిధులు మంజూరు కాకపోవడంతో రక్షణ చర్యలు ముందుకు సాగలేదు. కాగా.. ములకల్లంక గ్రామంలో పారిశుధ్య పనులు యథాతథంగా కొనసాగుతున్నాయి. బొబ్బిల్లంక రేవు, ములకల్లంక గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఇళ్ల వద్ద ఉన్న వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. బొబ్బిల్లంక రేవులో సిమెంట్ ర్యాంప్‌పైకి వచ్చిన గోదావరి వరద తగ్గుముఖం పట్టి రక్షణ గోడ దిగువ వరకు వెళ్లింది.

సుబ్రహ్మణ్యేశ్వరునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో బిక్కవోలు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆషాఢ మాసం కృత్తికా నక్షత్రం నాలుగో మంగళవారం సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

వైభవంగా మోదకొండమ్మ జాతర



జాతరలో ఆకట్టుకున్న వేషధారణలు



గరగ నృత్యాల సందడి

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామదేవత మోదకొండమ్మ జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మంది కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారం రోజుల క్రితం ఉత్సవాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. చివరి రోజు జాతరను సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ ప్రారంభించారు. ఉదయమే అమ్మవారికి గ్రామస్తులందరూ నైవేద్యాలు సమర్పించారు. ఉదయం 10 గంటలకు ఆలయం నుంచి ప్రారంభమైన ప్రదర్శన గ్రామంలోని ప్రధాన వీధులలో కొనసాగింది. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి, మద్దాల రమణ, తనకాల నాగేశ్వరరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు మద్దాల కృష్ణ, నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీనివాసులు, కోరుకొండ సీఐ అడపా నాగమురళీ, ఎస్సై డి.ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



అనపర్తి సింధు టవర్స్ అపార్ట్‌మెంట్‌లో ప్రత్యేక డ్రైవ్‌లో పాల్గొన్న సీఐ శివగణేష్, ఎస్ఐ రామారావు

పెదపూడి: అపార్ట్‌మెంట్ల వద్ద, ప్రతి ఇంటి ఎదురుగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని సీఐ శివగణేష్, ఎస్ఐ రామారావు సూచించారు. ఎవరైనా ఊరెళితే పోలీసు శాఖ ద్వారా అమలవుతున్న సీసీ కెమెరాల ఏర్పాటు, లాకింగ్ విధానాలపై మంగళవారం అనపర్తిలోని సింధు టవర్స్ అపార్ట్‌మెంట్‌లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శివగణేష్ మాట్లాడుతూ తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారన్నారు. అలాంటి చోరీలకు చెక్ పెట్టేందుకు పోలీస్ శాఖ ద్వారా సీసీ కెమెరాల ఏర్పాటు, లాకింగ్ విధానం అమలుచేస్తున్నామన్నారు. తమ వ్యక్తిగత పనుల నిమిత్తం కొద్దిరోజుల పాటు ఇతర ఊళ్లకు వెళ్లేవారు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సింధు టవర్స్ ప్రెసిడెంట్ శివారెడ్డి, ఆర్జీవీ పట్నాయక్, చిర్ల శ్రీనివాసరెడ్డి, కర్రి శ్రీకాంత్‌రెడ్డి, కర్రి అరవిందరెడ్డి, ప్రభాకర్‌రావు, తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య కేసులో యువకుడి అరెస్టు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): యువతి ఆత్మహత్యకు కారకుడైన యువకుడిని రాజమహేంద్రవరం టూ టౌన్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. ఎస్పీ నరసింహ కిషోర్ విడుదల మంగళవారం ఒక ప్రకటనలో ఈ వివరాలు తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తూ, ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న ఓ దళిత యువతి (29), సీతానగరం మండలం వంగలపూడికి చెందిన షేక్ నాగూర్‌బాబు నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. విషయం యువతి కుటుంబ సభ్యులకు తెలియడంతో అబ్బాయి తండ్రితో మాట్లాడారు. ఏడాది తరువాత వివాహం చేస్తామని వారు తెలిపారు. ఈలోగా నాగూర్ బాబు ఆ యువతిని మభ్యపెట్టి, ఆమె పేరిట లోన్లు పెట్టించి, రూ.11.97 లక్షలు తన అవసరాలకు వాడుకున్నాడు. అనంతరం ఆమెను వదిలించుకోవాలనే ఉద్దేశంతో అనుమానించి వేధించేవాడు. ఆమెను పరుష పదజాలంతో తిట్టేవాడు. కులం పేరుతో దూషించేవాడు. దీంతో తీవ్ర ఒత్తిడికి, మనస్తాపానికి గురైన ఆ యువతి గత జూన్ 29వ తేదీ అర్ధరాత్రి క్రిమిసంహారక మందు తాగి అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె సోదరుడి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పట్టిచ్చిన సెల్ ఫోన్

మృతి చెందిన యువతి సెల్ ఫోన్‌ను తనకు ఇవ్వాలంటూ ఆమె కుటుంబ సభ్యులను నాగూర్ బాబు ఒత్తిడి చేస్తూండటంతో వారికి అనుమానం వచ్చింది. యువతి ఫోను పరిశీలించగా ఆమెను నాగూర్‌బాబు వేధించిన వాయిస్‌లు, ఇతర అంశాలు బయటపడ్డాయి. ఆమె బ్యాగులో సూసైడ్ నోట్ లభించడంతో ఆ ఆధారాలను పోలీసులకు అందించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ ఈ కేసు దర్యాప్తు చేశారు. దళిత యువతి ఆత్మహత్య ఘటనలో నాగూర్ బాబు పాత్రకు సంబంధించిన ఆధారాలు సేకరించి, అతడిని అరెస్టు చేసి కోర్టులు హాజరు పరిచి, రిమాండుకు తరలించారు.

కూర ఘాటు.. తప్పని పాట్లు

- పెరిగిన కూరగాయల ధరలు
- దాదాపు రెండు నెలలుగా ఇదే పరిస్థితి
- ఇటీవల కురిసిన వర్షాలకు మునిగిపోయిన పంటలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు

రాజమహేంద్రవరం రూరల్: విపరీతంగా పెరిగిన కూరగాయల ధరలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. సామాన్యుడు వాటికి కొనడానికి భయపడే పరిస్థితి ఏర్పడింది. కేజీ కూరగాయలు కొనడానికి వెళ్లినవారు...ధరలను చూసి భయపడి అర కేజీ మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మనిషి ఎంత కష్టపడినా జానెడు పొట్టకోసమే. కడుపు నిండా తిని, హాయిగా నిద్రపోయే పరిస్థితి క్రమంగా దూరమవుతోంది. నచ్చిన కూరతో సంతోషంగా భోజనం చేయడానికి బదులు.. ఏ కూరగాయాల ధర తక్కువో తెలుసుకుని, వాటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజా కూరగాయాలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, అలాంటి వాటనే తినాలని వైద్యులు సూచిస్తున్నారు. అది నిజమే అయినప్పటికీ పెరిగిన ధరలు ప్రజలకు భయపెడుతున్నాయి.

రెండు నెలలుగా..

పెరిగిన కూరగాయల ధరలలో దాదాపు రెండు నెలలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడైనా అందుబాటులోకి వస్తాయనుకుంటే అధిక వర్షాలను పంటలను ముంచేశాయి. ముఖ్యంగా కూరగాయల పంటలను నాశనం చేశాయి. దీంతో ధరల దందా కొనసాగుతూనే ఉంది. మార్కెట్లో పచ్చిమిర్చి ధర ఆకాశాన్నంటింది. బంగాళదుంప, దొండకాయ, బీర, అల్లం ఇలా అన్నీ భగ్గుమంటున్నాయి. అధిక వర్షాలు, గోదావరి వరద ప్రవాహం కారణంగా లంక గ్రామాలు, ఇతర ప్రాంతాలలో కూరగాయల పంట మునిగిపోయింది.

ధర తగ్గిన టమాటా

వేసవిలో టమాటా సాగుకు జిల్లాలో అనుకూల వాతావరణ లేకపోవడంతో రైతులు ఆసక్తి చూపలేదు. దీంతో మదనపల్లి, బెంగళూరు, అనంతపల్లి, కర్నూలు నుంచి వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్నారు. మొన్నటి వరకు కిలో రూ.50 ఉన్న టమాటా ఇప్పుడు రూ.38 పలుకుతోంది. ఇప్పుడు వర్షాల కారణంగా మళ్లీ ధర పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. స్థానికంగా పండించే పంట మార్కెట్‌లోకి రావడానికి మరో నెల ఆగాల్సిందే.

ఉల్లిపాయలు

ఉల్లి ధర పెరుగుతోంది. రాష్ట్రంలో అత్యధికంగా ఉల్లిని ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే పండిస్తారు. కానీ అక్కడ కూడా ప్రస్తుతం తగ్గిపోయింది. ఖరీఫ్‌లో ఇప్పుడిప్పుడే సాగు మొదలైనట్లు సమాచారం. దీంతో మహారాష్ట్ర నుంచి ఉల్లిని దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో రైతు బజార్లలో కిలో ఉల్లి రూ.36 నుంచి రూ.40 వరకూ విక్రయిస్తున్నారు. బయట ఇంకా ఎక్కువ ధర వసూలు చేస్తున్నారు.

టెర్రస్ గార్డెన్స్‌పై దృష్టి

రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలలో టెర్రస్ గార్డెన్స్ కల్చర్ పెరిగింది. మహిళలు తమ ఇంటిలోని పైభాగంలో సేంద్రియ ఎరువులతో కూరగాయలను పండిస్తున్నారు. ఇంటిపై పెంచే కూరగాయల సాగునే టెర్రస్ టెర్రస్ గార్డెన్స్ అంటారు. ఇలా పండించిన కూరగాయాలను తమ ఇంటిలో ఉపయోగించుకోవడంతో పాటు స్నేహితులకు, బంధువులకు అందజేస్తున్నారు. అలాగే పెరుగుతున్న కూరగాయల ధరల నేపథ్యంలో మహిళలు సొంతంగా పండించుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

ధరల వివరాలు (కేజీ రూపాయలలో)

కూరగాయ	హోల్‌సేల్	లోకల్ మార్కెట్	రైతుబజార్
టమాటా	26	32	28
వంకాయలు (నలుపు)	46	54	48
వంకాయలు (తెలుపు)	46	54	48
వంకాయలు (గులాబి)	56	64	58
వంకాయలు (దొమ్మేరు)	62	70	64
బెండకాయలు	14	20	16
పచ్చిమిర్చి సన్నాలు	50	58	52
కాకరకాయలు	40	48	42
బీరకాయలు పందిరి గ్రేడ్-1	36	42	38
దొండకాయలు	32	38	34
బంగాళాదుంపలు	38	45	40
ఉల్లిపాయలు	34	40	36
చిక్కుడుకాయలు	78	86	80
చేమదుంపలు	40	48	42
బీన్స్‌కాయలు	70	78	72
బీన్స్‌గింజలు	123	136	126
అల్లం పాతది	140	154	144
చిలకడదుంప ఎరుపు	46	54	48